క్లుప్తంగా

ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సదానందం



నియామకపత్రం అందుకుంటున్న సదానందం

ఇల్లెందు: తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ఇల్లెందుకు చెందిన శ్రీ హరిహర క్షేత్రం అధ్యక్షుడు గందె సదానందం ఎన్నికయ్యారు. ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ శంకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజు నియామకపత్రం అందజేశారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కారదర్శులకు సదానందం కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ పాలకమండళ్లను నియమించండి..

కొత్తగూడెంటౌన్: భద్రాచలం, అన్నపురెడ్డిపల్లి దేవాలయాలకు పాలకమండలిలను ఏర్పాటు చేయాలని తొలిమలి 1969 తెలంగాణ ఉద్యమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెం గాజులరాజం బస్తీలో ఆయన మాట్లాడారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రమూర్తి, పాల్వంచ పెద్దమ్మతల్లి, అన్నపురెడ్డిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయాలకు ట్రస్ట్ బోర్డులను ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమన్నారు. కానీ ఒక పాల్వంచలోని పెద్దమ్మతల్లి ఆలయానికి మాత్రమే పాలకమండలిని నియమించి 8 నెలలుగా భద్రాచలం, అన్నపురెడ్డిపల్లిలకు మాత్రం మొండి చేయి చూపించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిమలి ఉద్యమకారులను గుర్తించి నామినేటెడ్ పదవులు కేటాయించాలన్నారు.

హాస్టళ్లలో డైనింగ్ హాళ్లు నిర్మించాలి

ఇల్లెందు: ఇల్లెందు పరిధిలోని పలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో డైనింగ్ హాళ్లు నిర్మాణం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఉమ్మగాని హరీష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పలు సంక్షేమ హాస్టళ్లను సందర్శించి పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా హరీష్‌గౌడ్ మాట్లాడారు. సాయి, సత్యాన్వేష్, రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పాల్వంచ: పట్టణంలోని గుడిపాడు ఆరోగ్య కేంద్రం పరిధిలో వనమా కాలనీ, జయమ్మ కాలనీ, వికలాంగుల కాలనీల ఆధ్వర్యంలో ఆదివారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ, హెచ్ఐవీ, హెపటైటిస్, టీసిఫిలిస్, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది రోగులకు వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పుల్లారెడ్డి, ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ... వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

పాల్వంచరూరల్: మండల పరిధి కోడిపుంజుల వాగు గ్రామపంచాయతీ పూసలతండా గ్రామంలో ఆదివారం గ్రామస్తులు నాభిశిల ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ఊరేగింపుగా వెళ్లి పసుపు, కుంకుమలతో పూజలు చేసి, ఈ ఏడాది వర్షాలు బాగా కురవాలని పాడిపంటలు బాగా పండాలని బోనాలు సమర్పించారు.

కొలువుదీరిన పీరీలు



అలంకరించిన పీరీలు

టేకులపల్లి: ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం ముస్లింలకు నూతన సంవత్సరం మొదటి నెల అయిన మొహర్రం మాసం ప్రారంభంతో త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలు టేకులపల్లి మండలంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని మూడుతండా, బోడు, మద్రాస్ తండా తదితర గ్రామాల్లో ఆషిర్ ఖానా (పీరీల చావడి) వద్ద పీరీలు కొలువుదీరాయి. టేకులపల్లి మండలంలో ముస్లింలు కాకుండా బంజారాలే పీరీల పండుగ నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. పీరీల చావడి వద్ద నిర్వాహకులు పీరీలను సంప్రదాయ బద్ధంగా శుద్ధి చేసి, వివిధ రంగుల వస్త్రాలు, పూలదండలతో అలంకరించి చావడిలో ప్రతిష్ఠాపన చేశారు. పది రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి.

కనికరం లేని 'సింగరేణి'

- నాలుగేళ్లుగా విజిలెన్స్ విచారణ
- ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న 500 మంది బాధితులు
- జీఎం కార్యాలయాల వెంట తిరుగున్న కార్మిక కుటుంబాలు



మోకాళ్లపై ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బాధిత సింగరేణి కార్మికులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం అలియాస్ పేర్ల మార్పిడి విషయంలో తీవ్రజాప్యం చేస్తోంది. సుమారు నలభై ఏళ్లు సంస్థలో వెట్టి చాకిరీ చేయించుకొని, సంస్థ అభివృద్ధికి పాటుపడిన సమయంలో రాని సమస్య, మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చే సమయంలో రావడం సరైంది కాదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోజు కంపెనీకి ఎవరైనా ఫరవాలేదు.. ఏ ఊరైనా, ఏ కులం అయిన ఎక్కడివారైనా కంపెనీలో ఉద్యోగం ఇచ్చి.. ఈరోజు తన ఉద్యోగం తనపిల్లలకు ఇవ్వమంటే నీ పేరు, భార్య పేరు, మీ తండ్రి పేరు తప్పుందని చెప్పటం కంపెనీకి ఎంతవరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు.

చిన్నచిన్న కారణాలతో సింగరేణి వ్యాప్తంగా 500 మంది కార్మిక కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వకుండా విజిలెన్స్ విభాగం నిలిపివేస్తోందని, ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా.. యాజమాన్యం కనికరించడం లేదని కార్మిక కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఆశించిన తల్లితండ్రుల ఆశ నిరాశగా మారి, కుదిరిన పెళ్లిళ్లు నిలిచిపోయే పరిస్థితులు ఎదురవుతున్నాయని, దిగిపోతే, వచ్చిన పైసలు ఇటు ఉద్యోగం రాక రూ.లక్షలు ఖర్చువుతున్నాయని, భవిష్యత్‌కు భరోసా లేకుండా పోతుంది. బాధిత కార్మికులు మోకాళ్లపై నిరసన తెలిపినా.. కన్నీటి పర్యంతమైనా సింగరేణి అధికారులకు జాలి కలగడం లేదని వాపోతున్నారు.

గత ప్రభుత్వం ఊరించింది..
ఈ ప్రభుత్వం నానబెడుతోంది...

సింగరేణి సంస్థలో పనిచేసే కార్మికులు అలియాస్ పేరు మార్పిడి (ఇంట్లో ఒకపేరు, గని వద్ద మరోపేరు)తో ఉన్న కార్మికులకు న్యాయం చేస్తామని 2017 ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తింపు సంఘం ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ప్రభుత్వ, యూనియన్ పదవీకాలం పూర్తయ్యే వరకు అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేసిందని, తాజాగా వచ్చిన కొత్త ప్రభుత్వం కూడా ఎన్నికల ముందు హామీ ఇచ్చి గద్దెనెక్కిన 16 నెలలు పూర్తయినా హామీలను అమలు చేయటం లేదని కార్మికులు రోదిస్తున్నారు. సుమారు 500 కుటుంబాలు ఇబ్బంది పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, మా బతుకులు ఇంతేనా అని ఆవేదన చెందుతున్నారు.

వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద అవకాశం కల్పించాలి...

సుమారు ఆరేళ్ల క్రితం మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయి ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకుంటే విజిలెన్స్ విభాగం అధికారులు నానా ప్రశ్నలతో (కోర్టులో కూడా ప్రశ్నించని విధంగా) ఇళ్ల మీదకు వచ్చి తమ పేర్ల గురించి ఆరా తీసి, తమను అగౌరవపరిచే విధంగా ప్రశ్నల వర్షం కురిపిస్తున్న తీరు చూస్తే సింగరేణి ఉద్యోగం వద్దు.. కూలి పని చేసుకుంటే మేలు అనే విధంగా విజిలెన్స్ విచారణ ఉందని, తాము సంస్థ అభివృద్ధికి సహకరించిన కార్మికులమని, ఇతర దేశాల నుంచి వచ్చిన మిలిటెంట్లం కాదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా రెండు పేర్లు ఉన్నవారికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఒక్క అవకాశం కల్పించి ఉపాధి కల్పించాలని కార్మిక కుటుంబాల సభ్యులు వేడుకుంటున్నారు.

విజిలెన్స్ పాత్ర ఎందుకు..?



సింగరేణి సంస్థలో పనిచేసిన ఉద్యోగులకు సమస్యలు పరిష్కరించే విభాగాలు ఐఆర్ పీఎం, వెల్ఫేర్ వింగ్, వీరితో చర్చించి ఫైనల్ చేయాల్సిన యాజమాన్యం వారసత్వ ఉద్యోగాలు ఇవ్వొద్దని నిర్ణయించుకున్నట్లుంది. విజిలెన్స్ సంవత్సరాల తరబడి జాప్యం చేస్తోంది. అసలు ఉద్యోగాల విషయంలో విజిలెన్స్ పాత్ర ఎందుకు?

– రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ

వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చెయ్యాలి..



ఈనెలలో జరిగిన నిర్మాణాత్మక సమావేశంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఉద్యోగ అవకాశం కల్పించాలని యాజమాన్యానికి విన్నవించాము. సానుకూలంగా స్పందించారు. అన్‌ఫిట్ అయిన నాటి నుంచి కార్మికుడికి సగం జీతం ఇవ్వాలనే డిమాండ్‌ను తాము త్వరలో పెట్టబోతున్నాము. యాజమాన్యం పట్టు వీడాలి.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

కమ్యూనిస్టులు ఏకం కావాలి..



మాట్లాడుతున్న సాబీర్‌పాషా (ఇన్‌సెట్) శ్రీనివాసరావు

ఇల్లెందు: నిన్నటి వరకు కమ్యూనిజానికి కాలం చెల్లిందని కొంతమంది దుష్ప్రచారం చేశారని, పేదలు ఉన్నంత కాలం, సైన్స్ ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా అన్నారు. ఆదివారం ఇల్లెందు 24 ఏరియా సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సీపీఐ పట్టణ 18వ మహాసభను ప్రారంభించారు. మాట్లాడుతూ.. కమ్యూనిస్టు నాయకులు గ్రామాలకు పట్టణాలకు తరలివెళ్లాలని, ప్రజల మధ్యనే ఉండాలని సూచించారు. నేతలుగా ప్రకటించుకుంటూ ఆఫీసులు, ఇళ్లల్లో ఉంటే ప్రజలను సమీకరించలేరని ఆలిండియా కమిటీ సూచించిందన్నారు. విద్యార్థి, యువజన, మహిళా, ప్రజానాట్య మండలి సంఘాలను బలోపేతం చేయాలని కోరారు. దేశ వ్యాప్తంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడులు పెరిగిపోయాయని తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచనలో బీజేపీ ఉందన్నారు. అనంతరం ఇల్లెందు పట్టణ నూతన కార్యదర్శిగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాస శ్రీనివాస్‌రావును ఎన్నుకున్నారు. రాష్ట్రంలోనూ అన్ని సమస్యలపై సీపీఐ సమరశీల పోరాటాలు చేస్తోందని తెలిపారు. మిర్యాల రంగయ్య, కె.సారయ్య, డి.శంకర్, బంధం నాగయ్య, ఉడుత ఐలయ్య, కొమరయ్య, మాజీ కౌన్సిలర్ రవి, కనకతార, చంద్రకళ పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకం కండి..

సింగరేణి(కొత్తగూడెం): పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకం కావాలని, మతోన్మాద కార్పొరేట్ రాజకీయ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కొత్తగూడెంలోని సీపీఎం కార్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. రెండో రోజు పార్టీ నిర్మాణం పని పద్ధతులు అంశంపై తరగతులు నిర్వహించారు. మాట్లాడుతూ... ప్రజా పోరాటాల ద్వారా పార్టీ విస్తరణ ఉంటుందన్నారు. ప్రజా సమస్యలపై ప్రజలను ఐక్యం చేయాలని మతం పేరుతో జరిగే విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను పోరాటల్లోకి తీసుకరావాలని చెప్పారు. బీజేపీ మతం పేరుతో ప్రజలను విభజించు, పాలించు అనే బ్రిటిష్ విధానాన్ని అమలు చేస్తోందని ఆరోపించారు. ప్రతీ అంశానికి మత రంగు పులిమి స్వార్థ రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకుంటూ ప్రజల మధ్య చీలికలు తెస్తోందన్నారు. ప్రజలు వీటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు లిక్కి బాలరాజు, భూక్యా రమేష్, సందకూరి లక్ష్మి, రమేష్, ఆలేటి శ్రీను, అన్నవరపు ఇందిరా, పప్పుల ప్రమోద్, ఎన్ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

టేకులపల్లి: జూలై 7న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సంఘం జిల్లా ఇన్‌చార్జ్ ములకలపల్లి రవి మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం టేకులపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో సంఘం జెండా దిమ్మెలు నిర్మించాలని పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకై పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అలుపెరుగని పోరాటం చేసి ఫలితాలు సాధించుకున్నామని ఈ ఫలితాన్ని గ్రామస్థాయి వరకు 100 ఏళ్ల భవిష్యత్ ఉండే విధంగా పోరాట ప్రస్థానం జరిగిందన్నారు. అదే క్రమంలో ఈ సమాజంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల అణగారిన కులాలకు వారి హక్కుల సాధన కోసం పోరాటం చేసి అనేక ఫలితాలు సాధించినట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, కమిటీలు పునర్నిర్మాణ కమిటీ ఏర్పాటు చేసి జూలై 7న 31వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరపాలని కోరారు. జనక ఇస్తారి, మెంతెన ప్రభాకర్, సత్యం, సైదులు, నామా, భోజ్యా నాయక్ పాల్గొన్నారు.

ఆ రెండు చెరువులకు కాంట్రాక్టర్లు దూరం

- నాలుగు చెరువుల్లో రెండింటికి మాత్రమే టెండర్లు దాఖలు
- చల్లసముద్రం పెద్దచెరువు బాధ్యత తీసుకున్న ఇరిగేషన్ అధికారులు
- కదిలించిన 'సాక్షి' వరుస కథనాలు



చల్లసముద్రం పెద్దచెరువు తూముకు నూతన షట్టర్ అమర్చుతున్న రైతులు, ఇరిగేషన్ అధికారులు

ఇల్లెందురూరల్: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందాలంటే మండలంలోని నాలుగు చెరువులకు తక్షణ మరమ్మతులు అవసరం. అయా చెరువుల దుస్థితిని వివరిస్తూ ఈ నెల 3న 'ప్రమాదకరంగా చల్లసముద్రం పెద్దచెరువు' 25వ తేదీన 'టెండరు దాఖలుకు వెనుకంజ' శీర్షికలతో 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు కాంట్రాక్టర్లు స్పందించారు. మూడోసారి పిలుపులో భాగంగా మండలంలో పూబెల్లి గ్రామ పంచాయతీ జామెల్లకుంట మరమ్మతులకు రూ.8.14 లక్షల వ్యయంతో, కొమరారం పంచాయతీ గుట్టల చెరువు మరమ్మతులకు రూ.8.15 లక్షల వ్యయంతో మూడో పిలుపులో భాగంగా కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేశారు. దీంతో ఆయా చెరువులకు త్వరితగతిన మరమ్మతు పనులు ప్రారంభమయ్యే అవకాశం ఏర్పడింది. కానీ చల్లసముద్రం పెద్దచెరువు, గోపాలరావు చెరువులకు మూడో పిలుపులోనూ కాంట్రాక్టర్లు ఎవరూ ఆసక్తి చూపలేదు. దీంతో తూము షట్టరు నుంచి నీరు బయటకు వెళ్లే పరిస్థితిలో ఉన్న చల్లసముదరం పెద్దచెరువు బాధ్యతను ఇరిగేషన్ శాఖ అధికారులు తీసుకున్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు ఇరిగేషన్ శాఖ ఏఈ రవికుమార్ తన సొంత ఖర్చులతో చల్లసముద్రం పెద్దచెరువు తూముకు నూతన షట్టర్ తయారు చేయించారు. రైతుల సహాయంతో ఆదివారం షట్టర్‌ను బిగించారు. ఇదిలా ఉండగా ధనియాలపాడు పంచాయతీ గోపాలరావు చెరువు తూము లోపలి భాగంలో పైపులు ఛిద్రమయ్యాయి. మరమ్మత్తు చేయించేందుకు కట్ట, తూమును పెకిలించి మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. ఎక్కువ ఖర్చు అయ్యే అవకాశం ఉండటంతో ఇరిగేషన్ అధికారులు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయకట్టు రైతులు శ్రమదానంతో ముందుకొస్తే తప్ప గోపాలరావు చెరువు ఆయకట్టుకు ఈసారి సాగునీరు అందే పరిస్థితి లేదు.

కళాకారులకు ప్రోత్సాహమివ్వండి..



ప్రశంసపత్రాలు అందిస్తున్న కొత్వాల

పాల్వంచ: కళాకారులను ప్రోత్సహిస్తూ వారికి చేయూత నివ్వడం సామాజిక బాధ్యత అని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాకాలపాటి కృష్ణయ్య కళాపీఠం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కేటీపీఎస్ సీతారామకల్యాణ మండపంలో ఆదివారం రెండోరోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులకు కొత్వాల ప్రశంసపత్రాలు, షీల్డ్‌లు అందించారు. మాట్లాడుతూ.. కళల పట్ల రోజురోజుకు ఆదరణ కరువవుతున్న తరుణంలో కళలను ప్రోత్సహించే విధంగా నాటకోత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కళాకారుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాజుగౌడ్‌ను సన్మానించారు. అనంతరం జరిగిన సంగీతం, జానపద, శాస్త్రీయ ప్రదర్శనలు, కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. కొండం వెంకన్న, పాకాలపాటి రోశయ్య చౌదరి, వై.వెంకటేశ్వర్లు, కాపర్తి వెంకటాచారి పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమించాలి



అభివాదం చేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఉద్యమించాలని బీసీ రాజ్యాధికారి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. ఆదివారం రాత్రి కొత్తగూడెంలోని పద్మశాలి కల్యాణ మండపంలో బీసీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. సురేశ్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో ఉన్న సామాజిక న్యాయ సాధన, సమానత్వం కోసం బీసీ రాజ్యాధికార సమితి కృషి చేస్తుందన్నారు. ఈ దిశగా బీసీల నాయకత్వ నిర్మాణాన్ని క్షేత్ర స్థాయిలో చేపడుతూ ఇప్పటికే 27 జిల్లాలలో కమిటీలను పూర్తి చేశామన్నారు. బీసీలను బలమైన సంఘటిత శక్తిగా మార్చడానికి కోటి సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కొత్తగూడెం జిల్లాలో త్వరలో నియోజకవర్గ, పట్టణ, డివిజన్, మండల, గ్రామ స్థాయిలో కమిటీలను పూర్తి చేస్తామన్నారు. గండి వీరేందర్ గౌడ్, రాచర్ల రాములు, సట్ల ప్రభాకర్, సాయి కిరణ్ పొడకంటి, మల్లెల రామనాథం, బొలిశెట్టి రంగారావు, కురిమెళ్ల శంకర్, సురేష్ పాల్గొన్నారు.

సబ్‌యార్డ్ నిర్మాణానికి స్థలం కరువు

ఇల్లెందురూరల్: కొమరారం కేంద్రంగా వ్యవసాయ మార్కెట్ సబ్‌యూనిట్ నిర్మాణం కోసం కసరత్తు ప్రారంభమైంది. ఇటీవల జరిగిన వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. దీనికోసం ఐదు ఎకరాల స్థలం అవసరమని గుర్తించి రెవెన్యూశాఖ అధికారులకు స్థలం అవసరాన్ని సూచిస్తూ వినతిపత్రం అందజేశారు.

ఈ క్రమంలో ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు ఆదివారం కొమరారం గ్రామంలో వివిధ రాజకీయ పక్షాల నాయకులు, రైతులతో సమావేశమై వ్యవసాయ మార్కెట్ సబ్‌యూనిట్ నిర్మాణం వివరాలను వివరించారు. దీనికోసం అవసరమైన స్థలాన్ని కొమరారం కేంద్రంగా కేటాయించేందుకు రెవెన్యూ అధికారులను కోరినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం కొమరారం ప్రాంతంలో ప్రభుత్వ భూమి కేవలం రెండు ఎకరాలు, అటవీభూమి ఎనిమిది ఎకరాలు అందుబాటులో ఉన్నాయని స్థానికులు సూచించారు. రెవెన్యూ భూమి సరిపోక పోవడంతో స్థల సేకరణపై అన్ని రాజకీయ పక్షాలతో మరోమారు సమావేశం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఇదిలా ఉండగా రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయిస్తే వెంటనే నిధులు మంజూరు చేయించుకొని నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు తెలిపారు.

విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న కిరణ్మయి

పాల్వంచ: విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, అందుకు అవసరమైన పుస్తకాలను సమకూర్చుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ అడిషనల్ సెక్రటరీ డాక్టర్ కిరణ్మయి అన్నారు. ఆదివారం స్థానిక అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని పాల్వంచ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ గణాంకాల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ సెక్రటరీ కిరణ్మయితో పాటు రెసిడెన్షియల్ కళాశాలల అడిషనల్ సెక్రటరీ డాక్టర్ పి.రామలింగేశ్వరశర్మలు కళాశాలను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాల నిర్వహణను పరిశీలించారు. అనంతరం గణాంక శాస్త్రవేత్త ప్రశాంత చంద్ర మహాల నోబిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిరణ్మయి మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధతో చదుకోవాలని, డిగ్రీ పూర్తయితే భవిష్యత్‌లో ఉన్నత చదువులకు అవకాశం ఉంటుందని, పోటీ పరీక్షలకు సిద్ధకావాలని, జీవితంలో స్థిరపడేందుకు ప్రణాళికలు చేసుకోవాలన్నారు. గణాంక శాస్త్రం ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఓఎస్‌డీ వివేకానంద, సూపరింటెండెంట్ వాణి, భద్రాచలం, పాల్వంచ ప్రిన్సిపాల్స్ స్వరూపరాణి, బోయిన ఝాన్సీరాణి, వైస్ ప్రిన్సిపాల్ యు.జ్వలిత, గణాంకశాస్త్ర అధ్యాపకురాలు బి.కల్పన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెపై విస్తృత ప్రచారం

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యల పరిష్కారానికి జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వామపక్ష యూనియన్ల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక శేషగిరిభవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ పరిశ్రమలను నిర్వీర్యం చేసే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. సింగరేణి ఫైనాన్షియల్ సెక్టార్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఆర్టీసీ, ప్రైవేట్ ట్రాన్స్‌ఫోర్టు జీహెచ్ఎంసీ తదితర సంస్థలను ప్రైవేట్ పరం చేయాలని 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చే విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని జాతీయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. సార్వత్రిక సమ్మె విజయవంతానికి ఈనెల 30, జూలై 1, 2, 3 తేదీలలో కొత్తగూడెం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న షాపింగ్ మాల్స్, ఆటోమొబైల్ షోరూంలు, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టులు, పెట్రోల్ బంకులలో విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా జూలై 5న మోటారుసైకిల్ ర్యాలీ, 7, 8 తేదీలలో మైక్ ప్రచారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు ఎండీ జలీల్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, జిల్లా కార్యదర్శి గెద్దాడి నగేష్, గనిగళ్ల వీరస్వామి, గట్టయ్య, సందెబోయిన శ్రీను, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, సహాయ కార్యదర్శి పద్మ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి, ఎస్.సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ముఖం చాటేసిన వరుణుడు

తొలకరి ఆశలు ఆవిరి..

- చినుకు పడదు.. చింత తీరదు
- ఆందోళన చెందుతున్న రైతులు



విత్తనాలు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

సుజాతనగర్: తొలకరి జల్లులు ముందే పలకరించడంతో మండలంలోని రైతులు పత్తి విత్తనాలు విత్తుకున్నారు. కానీ పదిహేను రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో భూమిలో నాటిన విత్తనాలు మొలకెత్తడం లేదు. కొన్ని భూముల్లో మొలకెత్తినా మొలకలు వాడిపోతున్నాయి. వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి పలువురు రైతుల బోర్లు వట్టి పోతున్నాయి. దీంతో రైతులు ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వర్షాలు కురవాలని.. రైతులు ఆలయాలు, పూజలు, కప్పతల్లి ఆటలు ఆడుతున్నారు.

ఎకరానికి రూ.10వేల పెట్టుబడి..

పత్తి విత్తనాలు విత్తుకోవడానికి రైతులు ఎకరానికి దాదాపు రూ.10వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఎకరానికి మూడు ప్యాకెట్ల విత్తనాలకు రూ.3 వేలు, దుక్కి దున్నేందుకు ట్రాక్టర్‌కు రూ.5 వేలు, కూలీలకు రూ.2 వేల వరకు ఖర్చు పెట్టారు. తీరా విత్తనాలు నాటిన తర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో మొలకెత్తడం లేదు. మొదట్లో వేసిన విత్తనాలు మొలకెత్తని చోట్ల మళ్లీ విత్తుకోవాల్సిన పరిస్థితి. దీనికి అదనంగా రైతులు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వెనకబడిన వర్షాలు..

ఈ సీజన్ లో ముందస్తుగా తొలకరి పలకరించడంతో రైతులు విత్తనాలు వేసుకున్నారు. అయితే తర్వాత నుంచి వర్షాలు కురవడం లేదు. వారం రోజులుగా మండల వ్యాప్తంగా అక్కడక్కడా చిరుజల్లులు కురుస్తున్నా విత్తనాలు మొలకెత్తేందుకు ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు. లోటు వర్షపాతం మూలంగా మొలకలు వాడిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంటల సాగు ఇలా..

మండలంలో ఇప్పటి వరకు 10,350 ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశారు. మరో 1200 ఎకరాల మేర పత్తి సాగు పెరగనుంది. 15 ఎకరాల్లో మొక్కజొన్న, 150 ఎకరాల్లో పెసర పంటలు సాగయ్యాయి. గత ఏడాది 400 ఎకరాల్లో మిరప పంట సాగవ్వగా ఈ ఏడాది మిర్చి సాగు తగ్గే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు తెలిపారు.


మూడెకరాల్లో పత్తి సాగు చేశాను..



నాకున్న మూడు ఎకరాలలో పత్తి విత్తనాలు వేశాను. తొలుత వర్షం పడడంతో దుక్కి దున్ని విత్తనాలు నాటాము. ఆ తర్వాత వర్షాలు కురవకపోవడంతో విత్తనాలు భూమిలోనే ఎండిపోయాయి. దీంతో రెండోసారి మళ్లీ 5 ప్యాకెట్ల విత్తనాలు నాటాను.

– బాదావత్ రాంకుమార్, సీతంపేట బంజర


రెండోసారి విత్తనాలు వేశాం..



ఈ ఏడాది వర్షాలు ముందస్తుగా సకాలంలో కురిశాయని పత్తి విత్తనాలు నాటాం. ఎండలు ఎక్కువగా ఉండటం, గింజలు నాటిన తరువాత వర్షాలు లేకపోవడంతో కొన్ని విత్తనాలు మొలకెత్తలేదు. మళ్లీ మూడు విత్తన ప్యాకెట్లు తెచ్చి విత్తనాలు నాటాం.

– గూని సుజాత, నాయకులగూడెం

పదును ఉంటేనే విత్తుకోవాలి..



రైతులు తొలకరి జల్లులు కురవగానే పత్తి విత్తనాలు విత్తుకున్నారు. అడుగున్నర లోతు పదును ఉంటేనే విత్తనాలు నాటుకోవాలి. నేలలో తడి లేక మొలకలు రావడం లేదు. జూలై నెలాఖరు నాటికి కూడా పత్తి వేసుకోవచ్చు. ఆందోళన చెందవద్దు.

– గాండ్ల నర్మద, ఏఓ, సుజాతనగర్